# ఋతుభ్రమణం



ఇంకా రాలేదు.

ఎంతకాలం ఈ ఎదురుచూపులు?

ఏమై వుంటుంది?

ఒకవేళ... ఊహు... అయి వుండదు.

తప్పనిసరిగా అదై వుండదు.

ఆమె తన మనసుకి తానే సర్ది చెప్పుకుంది.

ఒక పచ్చిపుండును లోపల దాచుకున్నట్టు వుంది ఆమెకు.

కళ్లు మూసుకుంటే వేడి అలలు దేహాన్ని ఆవరించుకుంటున్నాయి.

ఉక్కపోతగా అనిపించింది.

ఏదో ఉక్కిరిబిక్కిరితనంగా కూడా అనిపించింది.

**కల్పనా రెంటాల**

నెమ్మదిగా లేచి కిటికీ తలుపు తీసింది.

ఉత్తరపు గాలి మొహాన్ని ఒక్కసారిగా ముద్దు పెట్టుకుంది.

ఆ చలిగాలి శరీరాన్ని మనసుని సేద తీరుస్తోంది.

ప్లీజ్! ఆ తలుపు వేసేయరాదూ! అసలే చలిగావుంది అంటూ దుప్పటి ముసుగులోకి మరింతగా ముడుచుకున్నాడు అతను.

నెమ్మదిగా కిటికీ తలుపు వేసేసి శబ్దం కాకుండా బైట తలుపు తీసి ఆరుబయట వరండాలోకి వచ్చింది. చల్లగాలి ఇప్పుడు మరింత ఎక్కువగా దగ్గరకు తీసుకుంది. చీరకొంగును భుజాలమీదుగా కప్పుకుని అక్కడున్న అరుగు మీద కూర్చుంది.

ఎవరన్నారు ఒంటరితనం బాధాకరమని?

ప్రాణవాయువులాగా అది కూడా ఓ తప్పనిసరి అవసరం కదా! మనుష్యుల మధ్య ప్రేమ ఎంత అవసరమో ఒంటరితనం కూడా అంత అవసరం. అప్పుడే కదా మన లోపల్లోపలకి తొంగి చూసుకోగలం. ఎవరికీ తెలియని రాక్షసుడి ప్రాణరహస్యం దాచుకున్నట్టు ఆ ఏకాంతానికి ఎన్ని అరలు? ఎన్నో రహస్యాలు తెలిసిన ప్రాణస్నేహితుడిలా! ఆమె చెట్లు, పుట్టలు, ఆకాశం, నక్షత్రాలు, తీతువుపిట్ట అన్నీ రాత్రి భాష మాట్లాడుకున్నాయి. అలసట పోయి శరీరానికి కొత్త ఉత్సాహం వచ్చినట్లనిపించింది. కనురెప్పల్ని నిద్రకమ్ముకుంటుంటే నిశ్శబ్దంగా లోపలకు వచ్చింది. పిల్లలిద్దరి ఒంటి మీద దుప్పట్లు సరిచేసి వారి పక్కన నడుం వాల్చింది ఆమె.

** ** **

పొద్దుట లేవగానే చేసిన మొదటి పని కాలెండర్ దగ్గరికెళ్లి తెలిసిన లెక్క మళ్లా చేసింది. రోజులు లెక్కపెట్టడం. 27వ రోజుకు ఎర్ర ఇంకుతో సున్నా పెట్టింది. 28వ రోజు. ఇవాళైనా...? వస్తాడో రాడో తెలియని అతిథి. పీడకల కోసం కూడా ఎదురుచూపులా? అవును. తొందరగా ఆ పీడకల వచ్చేస్తే ఎంత బావుంటుంది? ఎంత హాయి? ఎంత తేలికదనం శరీరానికి, మనసుకి

**ప్రవాసాంధ్ర కథ**

అసలు ఈ నెల రాదా? ఒకవేళ రాకపోతే... అదేనా... పోనీ ఆ హోమ్ కిట్ వాడితే తెలిసిపోతుంది కదా! వద్దులే. ఇంకో రెండు మూడు రోజులు వెయిట్ చేద్దాం. ప్రతినెలా ఓ ఎదురుచూపు. ఇంకేమీ పని లేనట్టూ, జీవితానికి వేరే లక్ష్యమేమీ లేదన్నట్టూ ఆ డేటు ఎప్పుడా, లెక్క సరిగ్గా వుందా, వస్తోందా, రావడంలేదా, హార్మోన్లలో తేడా వస్తోందో? ఆహారపుటలవాట్లు ఏమైనా మార్చాలా? జీవితం మొత్తం ఆ ఋతువు చుట్టూ తిరుగుతూ వుంటుంది కదా అనిపిస్తోంది. రావడంలో వుండే ఇబ్బందులు. రాకపోవడంలో వుండే ఇబ్బందులు. ఇటైనా, అటైనా ఇబ్బందులు తప్పవు. అందరికీ ఆరు ఋతువులైతే మాకేమిటో ప్రతినెలా ఈ ఆడ ఋతువు.

ఋతుక్రమం అనేమాట పదకొండేళ్లకే తెలిసింది. రజస్వల అయినప్పుడు మాత్రం భలే సంతోషమేసింది. ఎందుకంటే అప్పటిదాకా నువ్వుల వుండ దొంగచాటుగా తినడమే తప్ప సరిగ్గా తినలేదు. చిమ్మిలి తింటే నువ్వు కూడా అప్పుడే కూర్చుంటావే అమ్మా అంటూ అమ్మ దూరం పెట్టేది. అయినా అక్కను బతిమిలాడి దాని దగ్గర నుంచి కొంచెం పెట్టించుకుని తినేవాళ్లం. ఇప్పుడు నాకు చిమ్మిలి వుండ తినే హక్కు వచ్చేసింది కదా అనుకున్నాను. అందులోని కష్టాలు ఇప్పటికి కదా తెలిసాయి. నెల గిర్రున తిరిగొచ్చేసేది. అప్పట్లో ఇన్ని సౌకర్యాలుండేవి కావు. అవి వాడటంలో వుండే ఇబ్బందులు, ఎవరికీ తెలియకుండా వుంచుకోవాలనుకునే తాపత్రయం. ఎవరికైనా తెలిసిపోతే వుండే సిగ్గు. రకరకాల సందేహాలు, అమ్మనడిగితే అంతా దాపరికంగా వుంచాలనేది. మూడురోజులు దూరంగా కూర్చుంటే అందరికీ తెలిసిపోతుంది కదా ఇంకేమిటి దాపరికం అంటే అదంతేలే నోరుమూసుకో అనేది. కాలేజీలో కాస్త డబ్బు, పరిజ్ఞానం వున్న స్నేహితురాళ్ల వల్ల దాని చుట్టూ వుండే ఓ రహస్య వలయాన్ని ఏదో ఛేదించాం. కొంత తెలుసుకున్నామన్న సంతోషం. కానీ తెలుసు అంటే ఒప్పుకోరు కదా. తెలిసినట్టు చెప్పుకోనివ్వరు కదా. ఎందుకే పెద్దవాళ్ల విషయాలు అంటూ పైకి మాట్లాడనిచ్చేవారు కాదు. అది టి.వి. వచ్చిన కొత్త. పుస్తకాల్లోనో, టివిల్లోనో శానిటరీ నాప్‌కిన్స్ అడ్వర్‌టైజ్‌మెంట్స్ వస్తే అదేమిటో ఏం జరుగుతోందో అన్నయ్యలకు అందరకూ తెలిసిపోతోందనే సిగ్గుతో తలదించేసుకున్నా దానికి సంబంధించి తెలియని కొత్త విషయాలు తెలుసుకోవాలని లోపల ఆరాటం. కానీ అమ్మావాళ్లు పడనిస్తేగా. అందుకే తెలుసుకోవాల్సిన విషయాలన్నీ దొంగచాటుగానే తెలుసుకుని ఏమీ తెలియనట్టు అమాయకపు మొహాలు వేసుకుని తిరిగే వాళ్లం. అక్కకు నెలసరికి ముందు నుంచి విపరీతమైన కడుపునొప్పి వచ్చేది. నాకు మాత్రం నడుమునొప్పే కానీ కడుపునొప్పి వుండేదికాదు. అక్కకి అమ్మా, వదిన కలిసి బెరాల్‌గాన్ ఇచ్చేవారు. ఎంతలే. ఆ పెళ్లయి కార్యం అయిపోతే ఇలాంటి నొప్పులేమీ వుండవు. అప్పటిదాకా ఎలాగో ఓర్చుకోమ్మా ఈ ముట్టుశూల అంటూ అమ్మ దూరం నుంచే ధైర్యం చెప్పేది. నాకైతే అక్కను తాకి పక్కన కూర్చోని కాసేపు కాళ్ళు పిసకాలనిపించేది. మైలమైల అంటూ మూడ్రోజులు దూరం పెట్టేవారు. ముట్టుస్నానం అంటే అదో తతంగం. తెల్లారగట్ట సూర్యోదయం కాక

ముందే చేసెయ్యాలి. అమ్మ వచ్చి పైనీళ్లు పోసి పసుపుముద్ద చేతిలో వేసి కొంచెం నీళ్లు పోసి నాలుగు దిక్కులకు తిరిగి తెలిసి చేసిన పాపం, తెలియకచేసిన పాపం, అన్నం పెళ్ల తొక్కిన పాపం, సూర్యుడ్ని చూసిన పాపం, అన్ని పాపాలు పోవాలి అంటూ చెప్పించి బావి దగ్గర స్నానం చేయించేది. అమ్మా సూర్యుడ్ని చూడటం కూడా పాపమా అంటే అవు ను కాదూ, పంచభూతాల్ని చూడకుండా చీకట్లో వుండాలే. ముట్టుదాని మొహమే చూడకూడదంటారు మా నాన్నారు అంటూ ఓ కథ చెప్పేది. చాల్లేమ్మా వీధిలో వాళ్లు మమ్మ ల్ని చూసి నవ్వుతారు అంటే మీకలాగే వుంటుందిలే. రేపు పెళ్లయి అత్తవారింటికెళితే ముట్టు, మైల, మడి ఆచారాలు సరిగ్గా నేర్పించ లేదని అమ్మని నన్ను కదా ఆడిపోసుకుంటారు. అందరిచేత నన్ను తిట్టించండే అంటూ గుడ్లనీరు కుక్కుకునేది. అమ్మ కళ్లనీళ్లు చూస్తే జాలేసి పోన్లేమ్మా, పెళ్లయితే ఏ కష్టాలు పోతాయో పోవో గానీ ఈ ముట్టు కష్టాలు పోతే బావుండు అను కునే వాళ్లం మేం అక్కచెల్లెళ్లం. తెల్లారిన తరువాత చాకలిది వచ్చి మా మైల బట్టలు ఉతికేందుకు తీసు కెళుతుంటే దాని సంగతేమో కానీ మాకైతే లోపల్లోపల సిగ్గుతో చితికిపోయేవాళ్లం. మనకు మైల అయింది చాకలి దానికి ఎందుకు కాదమ్మా అంటే వాళ్లను దేవుడు పుట్టించిందే మన మైలను పోగొట్టడానికి. అమ్మ రుణమైనా తీర్చుకోగలం కానీ అందుకే చాకలి దాని రుణం తీర్చుకోలేమంటారే అంటూ అమ్మ ఉద్బోధ. ఇంట్లో కలిపేసుకుందామా. అన్నం తిన్నకంచాలు బైటకెళ్లి కడు క్కుంటుంటే ఎదురింటి డాక్టరుగారి అబ్బాయిలు అంతా తమకేదో తెలిసిపోయినట్టు మొహాలు పెడుతున్నారే చచ్చే సిగ్గుగా వుంది అంటే చాలు చాలు. ఇప్పటికి కలుపుకుంటున్నవి చాలు, కాలేజీలో శూద్రులతో స్నేహాలు, వాళ్లను తాకిన బట్టలతో ఇంట్లోకి రావడాలు, ఇవి చాలవా అంటూ అమ్మ నోరు నొక్కుకోవడాలు. చదువై పెళ్లయితే దేనికి స్వాతం త్ర్యం వచ్చిందో లేదో కానీ ముట్టుకు మాత్రం బోలెడు స్వేచ్ఛ వచ్చింది. కడుపుతో వున్నప్పుడు ఓ 9 నెలలు ఈ ముట్టు నొప్పిపోయింది కదా అని సంతోషమేసింది. నా ఇల్లు కాబట్టి నేనే హాయిగా బైట చేరగానే తలస్నానం చేసేసి లోపలకు వచ్చేసేదాన్ని. కాకపోతే ఆ మూడురోజులు దేవుడి గది లోకి వెళ్లకుండా జాగ్రత్తపడితే చాలు. వెంటవెంట కాన్పులు, పిల్లల పెంపకంలో పెద్దగా ఈ ముట్టు ఇబ్బంది పెట్టిందో లేదో గమ నించే స్థితిలో లేను. ఈమధ్యనే రెండేళ్ల బట్టి మరీ కడుపునొప్పి ఎక్కువ

చదువై పెళ్లయితే దేనికి స్వాతంత్ర్యం వచ్చిందో లేదో కానీ ముట్టుకు మాత్రం బోలెడు స్వేచ్ఛ వచ్చింది. కడుపుతో వున్నప్పుడు ఓ 9 నెలలు ఈ ముట్టు నొప్పిపోయింది కదా అని సంతోషమేసింది. నా ఇల్లు కాబట్టి నేనే హాయిగా బైట చేరగానే తలస్నానం చేసేసి లోపలకు వచ్చేసేదాన్ని.



వుతోంది. నలభై రాకుండానే ఈ మెనోపాజ్ బాధలేమిటో నాకు తెలి యటంలేదమ్మా అంటుంది మా అమ్మ ఏదైనా చెపితే. నాకైతే 55 ఏళ్ల వరకు ఈ బాధే లేదే. అనుకుం టాం కానీ నెలనెలా అలా ముట్టు వచ్చేస్తేనే ఆడదానికి ఆరోగ్యమమ్మా. రాకపోతేనే నానా తిప్పలు. మీరే మో వూ అంటే ఆ అంటే గర్భసంచి తీసేస్తే పోలా అంటారు. అసలు ఆ చెడు రక్తం ప్రతినెలా పోతేనే ఆడది నిండునూరేళ్లు ఆరో గ్యంగా బతుకుతుంది అంటుంది మా అమ్మ నోరు విప్పి తే ఆడవైద్యం గురించి చెపుతూ. అవునూ ఇవాళ 28వ రోజు కదూ. అమ్మలెక్క ప్రకారం ప్రతి 28 రోజులకు నెలసరి రావాలి. ప్రతినెలా బిష్టు స్నానం నుంచి 13వ రోజు అండం విడుదల వుతుందట. ఇలా లెక్కగా జరిగితే ఏ రోగం రొష్టూ లేకుండా సంపూర్ణ స్త్రీత్వంతో వుంటా మట. అంటే ఇప్పుడు నేను సంపూర్ణ స్త్రీని కానా? ఈమధ్య హార్మోన్లలో మార్పులు వచ్చి నట్టున్నాయి. మోకాళ్ల మీద సన్నగా వెంట్రుకలు మొలుస్తున్నాయి. ఆ మధ్యన బస్సులో ఒకావి డను చూశాను. పెదాల మీద మగవాళ్లలా మీసా లు, అందరూ అదేపనిగా ఆవిడ మీసాల వంక చూస్తుంటే పాపం ఆమె సిగ్గుతో తలదించుకుంది. ఆవిడ శరీరంలో వస్తున్న హార్మోన్ల తేడా తప్ప అది ఆమె స్త్రీత్వంలో వచ్చిన మార్పుకాదని నాకున్న పరిజ్ఞానంతో ఆమెకు చెప్పాలనిపిం చింది. ఇంతకీ నాకు ఈనెల ముట్టు వస్తుందా, రాదా? ఇప్పుడే టెస్ట్ చేయించుకుంటే సరిగ్గా తెలియక పోవచ్చు. ఎప్పుడో అయిదేళ్ల క్రితం ఓసారి చూసుకున్నాను. ఇప్పుడు మార్కెట్‌లో కొత్తకొత్త రకాలు వస్తు న్నాయి. చిన్నగా ముద్దొచ్చే ప్యాకెట్. అది అవునో... కాదో అంతా ఓ సన్నటి పింక్‌లైన్ చెప్పేస్తుంది. పింక్‌లైన్ అనుకోగానే మొన్ననే చదివిన అండర్ ది థిన్ పింక్‌లైన్ కొత్త నవల గుర్తొచ్చింది. ఆ కామెడీ వెనుక కనిపించని ఎందరో ఆడవాళ్ల జీవితపు విషాదాలు దాగివున్నాయనిపిం చింది. ప్రతినెలా ఓ ఎదురు చూపు. ఎంత విషాదం. ఓ అమ్మాయి ప్రెగ్నెన్సీ కోసం ఎదురుచూస్తుంటుంది. ఇంట్లోనే ప్రెగ్నెన్సీ టెస్ట్ చేసు కుని చూసుకుంది ఆతృతగా. కడుపుతో వున్న దానికి గుర్తుగా పింక్‌లైన్ వచ్చింది. బాయ్‌ఫ్రెండ్‌తో సహా అందరికీ కడుపుతో వున్నట్టు చెప్పే స్తుంది. అయితే రెండుమూడు రోజులకే పీరియడ్స్ వచ్చేస్తాయి. ఏంచేయాలో మొదట అర్థంకాదు. కానీ చూద్దాం. అందరికీ చెప్పేను కదా... వచ్చేనెల ప్రెగ్నెన్సీ రావచ్చు కదా అనుకుంటూ రాని కడుపును నటిస్తుంది. కడుపుతో లేకపోయినా వున్నట్టు నటిం చడం మొదట్లో ఆమెకు తమాషాగా వుంటుంది. తను ఎక్స్‌పెక్టింగ్ మదర్ అని తెలిసిన వాళ్లంతా తను వస్తుంటే డోర్ తీయడం దగ్గర నుండి బస్సు లో, రెస్టారెంట్‌లో సీటు ఇవ్వడం వరకూ ప్రత్యే కంగా చూడటం ఆమెకు బావుంటుంది. అసలు విష యం తెలిసిన ఒక ఫ్రెండ్ మాత్రం ఆమెను పిచ్చి దాని వంటాడు. కడుపు అనేది దాచుకునేది కాదు కదా అందరికీ బైటకు తెలియాలి కదా... నాలుగైదు నెలలు పోయాక గుడ్డముక్కలతో కుట్టిన పిల్లోను లోపల పెట్టుకుని తొమ్మిది నెలల దాకా మేనేజ్ చేస్తుంది. కడుపు రాకపోయినా కడుపుతో వున్న వాళ్లు ఏమేం చేయాలో ఏమేం చేయకూడదో అన్నీ తెలుసుకుని అచ్చంగా అలాగే ప్రవర్తిస్తుంది. చివ రకు నాటకీయంగా తొమ్మిది నెలలు నిండు తుండగా కనాల్సిన అవసరం లేకుండా ఆమెకు చర్చి దగ్గర ఓ పసిబిడ్డ దొరుకుతుంది. లోకానికి తన బిడ్డగా పరిచయం చేసేందుకు దేవుడిచ్చిన వరంగా ఆమె ఆ బిడ్డను తీసుకుంటుంది.

ఎక్కడైనా అలా జరుగుతుందా? ఎవరైనా కడు పుతో లేకపోయినా వున్నట్టు నటిస్తారా? పైగా ఎలాంటి బలమైన కారణం లేకుండా? ఊరికే తమాషాకి ఇదంతా చేస్తారా అనుకుంది. దానికన్నా తాను ఎక్కువ ఆలోచించిన అంశం ఆ ప్రెగ్నెన్సీ

టెస్ట్ గురించి, సో అది అప్పుడప్పుడు అలా తప్పులు చేస్తుందన్నమాట. ఎందుకైనా మంచిది. దానిమీద ఆధారపడకుండా డాక్టరు దగ్గరకు వెళ్లి పరీక్ష చేయించుకోవడమే శ్రేయస్కరం అనుకుంది. చూద్దాం. ముందు ఈనెల గడవాలి కదా. రాక పోతే అప్పుడు చూద్దాం. పాప పుట్టినప్పుడే తాను ఆపరేషన్ చేయించుకుంటానంది కానీ బాగా వీక్‌గా వున్నావని డాక్టరు ఒప్పుకోలేదు. కిరణ్ తాను చేయించుకుంటానని చెప్పి అయిదేళ్లయింది కానీ ఇంతవరకూ చేయించుకోలేదు. ప్రతినెలా ఇదో నరకం, వస్తుందా, రాదా... రాకపోతే... మళ్లీ కడుపు వస్తే... బాబోయ్ అబార్షనా? పురిటినొప్పుల కంటే ఎక్కువట. అందరూ చెప్తుంటారు. నావల్లకాదు. ఈసారి ఏమైనా కానీ కిరణ్‌ను బలవంతంగా తీసుకెళ్లి ఆపరేషన్ చేయించాలి. ఆ టెన్షన్‌కు తోడు ఈ పిఎంఎస్ ప్రాబ్లెమ్. పీరియడ్స్‌కు ముందు ఎంత చికాకు, కోపం. ఊరికే విసుగు, అలసట. ఓ పక్క ఇంట్లో పని. ఆఫీసులో పని.

ఒత్తిడి, పిల్లల పెంపకం. వీటన్నింటి మధ్య మరింత ఎక్కువ నలిగిపోతున్నట్టనిపిస్తోంది. ఒక్కోసారి చచ్చిపోదామా అన్న ఆలోచనలు వస్తుంటాయి. ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఫీలింగ్. తెలియకుండానే ఏడుపు వచ్చేస్తోంది. ఎక్కడికైనా పారిపోదామా అనిపిస్తుంది. కానీ ఎక్కడికెళతాం? ఎక్కడికెళ్లినా మన శరీరం మన మనసు మనతోనే వుంటాయి కదా. అవి చాలదు మన బాధ మనం మరిచిపోకుండా చేయటానికి. పిల్లలకు ఇవన్నీ ఏం తెలుస్తాయి. వాళ్లు పాపం అప్పటికీ చాలా తక్కువ అల్లరే చేస్తారు. తనకే ఆ కాస్త కూడా తట్టుకునే శక్తి లేదనిపిస్తుంది. కిరణ్‌కు చెప్తుంటే అలాగే అలాగే అని తలవూపటం తప్ప రెండోరోజు పొద్దుటికి అన్నీ మరిచిపోతాడు. ఆ పదిరోజులు నా జోలికి రావద్దు. నాతో అనవసరంగా తగువు పడవద్దు అంటే. వింటాడా? కాస్త బాగుండనప్పుడైనా వంటచేయడమో, ఇల్లు సర్దడమో, పిల్లల హోంవర్క్ చేయించడమో చేయమంటే సరే సరే అంటాడు. మళ్లీ కథ మామూలే. ప్రతి నెలా చెప్పటమే తప్పు... ఇద్దరికిద్దరం. ఏదో చిన్న మాట చిలికిచిలికి పెద్దదవుతుంది. తెలియని ఆవేశంలో తాను కూడా ఏవేవో మాట్లాడటంతో అతనూ రెచ్చిపోతాడు. ఓ వారం మౌన యుద్ధం తరువాత మళ్లీ సారీ చెప్పుకోవడం. అంతా అయన తరువాత అయినా నీకు కోపం ముక్కు చివరే వుంటుందోయ్. అక్కడ వెంట్రుకలు పడ్డాయ్, ఇక్కడ సరిగ్గా తుడవలేదు అంటూ నీ క్రమశిక్షణతో మా ప్రాణాలు తోడేస్తున్నావు. పిఎంఎస్, మెనోపాజ్ అంటావు కానీ అంతకుముందు మాత్రం నీకు కోపం లేదా? పీరియడ్స్‌కు ముందు పిఎంఎస్ అంటావు, మళ్లీ పీరియడ్స్ గొడవ ఓవారం. అదికాగానే ఓ పదిరోజులు ప్రశాంతం. మళ్లీ నీ పీరియడ్స్ కోసం ఎదురుచూపులు. నీకన్నా మాకు చచ్చేచావుగా వుందోయ్. పోనీ ఏకంగా ఆ యుటెరెస్ తీసేయించుకోవచ్చుకదా! మీ స్త్రీవాదులకు అదేమంత బాధకాదు కదా అంటూ నన్ను మరింత రెచ్చగొడుతుంటాడు. అసలు నొప్పికంటే ఆ తలతిక్క వాదన మరీ కోపం తెప్పిస్తుంది. పైగా నీకు ఈస్ట్రోజన్ తక్కువైందా? లేకపోతే టెస్టోస్టిరాన్ హార్మోన్ విడుదల ఎక్కువైందనుకుంటాను. అందుకే నీలో కొన్ని మగలక్షణాలు నెమ్మదిగా వస్తున్నట్టున్నాయి. పోనీ హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ చేయించుకోవచ్చు కదా. మాకు కూడా ప్రాణానికి హాయిగా వుంటుంది అంటూ తనకు కూడా స్త్రీల శరీరాలకు సంబంధించిన చాలా విషయాలు తెలిసినట్టు పేపర్లలో చదివేదంతా ముక్కునపట్టి అప్పచెప్తాడు. తనకు ఆ మాట వింటే మరీ చికాకు ఎక్కువవుతుంది. అప్పుడిక తను కూడా సైంటిఫిక్‌గా, లాజికల్‌గా వాదించడం మొదలుపెడుతుంది. అసలు స్త్రీత్వమంటే ఏమిటి? పురుషత్వం అంటే ఏమిటి?

మగ బాస్‌లు కోపంగా వుంటే అబ్బో చండశాసనుడు అంటూ భయపడతారు. అదే ఆడబాస్‌లు స్ట్రిక్ట్ గా



వుంటేనో, కోపంగా అరిస్తేనో వీళ్లే ముందు పిఎంఎస్, మెనోపాజ్ అంటూ పేర్లు పెట్టేస్తారు.

ఇద్దరికీ మధ్య ఒక్క క్రోమోజోమే కదా తేడా, దానికే ఇంత భిన్నంగా వుండాలా? ఈస్ట్రోజెన్ తక్కువైతే నేను స్త్రీని కానా? కాళ్లమీదో, పెదాల మీదో, చంకలకిందో జుట్టు పెరుగుతుంటే నేను మగవాడినైపోతున్నట్టా? సరే... నువ్వు చెప్పినట్టే ఈస్ట్రోజెన్ పిల్స్ మింగితే నేను మరింత ఆడదాన్ని అవుతానన్నమాట. అంటే నన్ను నియంత్రించేది శాసించేది, నిర్ణయించేది ఆ ఈస్ట్రోజెన్ పిల్లే కానీ నా మనసో, నా ఆలోచనలో, నా ఉద్వేగాలో కాదన్నమాట. అయినా, ఎవరు చెప్పారు నీకు ఆడవాళ్లకు కోపమొస్తే పిఎంఎస్, డిప్రెషన్ వస్తే మెనోపాజ్ అని. వాళ్ల మనసులో జరిగే సంఘర్షణను,వాళ్ల శరీరాలపై, మనసులపై సాగుతున్న ఒత్తిడిని మీరు మానవీయంగా అర్థం చేసుకుని సహకరించలేరా? అంటుంటే అమ్మా, ఫెమినిస్టుగారూ మీరు రచయిత్రినో, జర్నలిస్టో కాకుండా సైకలాజిస్టో, గైనకాలజిస్టో అయితే మరింత లాభముండేది అంటూ ఆ వాదనకు స్వస్తిచెప్పేస్తాడు. ఒళ్లంతా నొప్పులు. తలదిమ్ముగా వుంది. తొడలు పగలగొట్టడమంటే ఏమిటో మళ్లీమళ్లీ తెలుస్తోంది. తాజా కాఫీగింజల వాసన ఉత్తేజాన్ని ఓ ఉద్వేగాన్ని కూడా ఇస్తోంది. కెఫిన్ ఎక్కువైతే... ఫోలిక్ యాసిడ్ తక్కువైతే... ఉప్పు తగ్గించాలి. స్వీట్స్‌కి రామ్‌రామ్. తీపిపదార్థాలు ఎక్కువ తీసుకుంటే కోపం మరీ ఎక్కువవుతుందట. ఆఁ అంతకుముందేదో తక్కువ వున్నట్టు పక్క నుండి వెక్కిరింతలు.

ప్రతి దానికీ ఈ తాను లెక్కలు? ఏది ఎక్కువ తీసుకోవాలి? ఏది మానెయ్యాలి? సమతుల్యత అనుకోగానే అప్రయత్నంగా నవ్వు వచ్చింది. మానవ సంబంధాలన్నీ అసమ సంబంధాలే కదా! నిన్న ఆఫీసులో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

మేడమ్‌కి అసలే కోపం ఎక్కువ. ఈమధ్య మరీ ఎక్కువైంది. పిఎంఎస్ ప్రాబ్లమ్ అనుకుంటాను. అప్పుడే మెనోపాజా? అరే నీకు తెలీదా... పిఎంఎస్ అంటే ప్రీ మెనుస్ట్రువల్ సిండ్రోమ్ ఒక్కటే కాదు. ప్రీ మెనోపాజ్ సిండ్రోమ్ కూడా. నేను మొన్ననే లేడీస్ పేజీలో ఆర్టికల్ చదివాను. అది వున్నవాళ్లు అంతే. ప్రతి చిన్న దానికి రెచ్చిపోతుంటారు. కయ్యిమని లేస్తారట ఏ మాట అన్నా. నువ్వు చూసావుకదా. మేడమ్ ఇదివరకు అప్పుడప్పుడూ కోపంగా వున్నా సామాన్యంగా నవ్వుతూ హుషారుగా, ఉత్సాహంగా వుండేవారు. ఇప్పుడు చూడు. ఎప్పుడు చూసినా చిటపటలు. ముఖం మాడ్చుకోవటాలు. పైగా మనమేదో చేసినట్టు మనమీద అయినదానికీ కానిదానికీ ఎగరటాలు. ఇంట్లో వాళ్ల ఆయనా పిల్లలు ఎలా భరిస్తున్నారో కానీ... అయినా ప్రతి దానికీ మేం సరిసమానం అంటూ వస్తారు కానీ వీళ్లు సరిగ్గా పని చేసేది ఎక్కడా? వీళ్లు ఎలా పనిచేస్తారో? వీళ్లకు ప్రమోషన్లు ఎలా వస్తాయో మనకు తెలీదా? అయినా మాకు పిఎంఎస్ అని మెడలో బోర్డు కట్టుకోవచ్చు కదా అందరికీ తెలిసేలాగా. అది చూసి మనలాంటివాళ్లు కొందరైనా జాలిపడతారు కదా.

అడ్డూ అదుపూ లేకుండా అలా సాగిపోతున్న వాళ్ల కామెంట్స్ విని తలంతా పోట్లు వచ్చేసింది ఆమెకు. నిస్సత్తువగా, తన ఏకాంత రహస్యమేదో బైటపడిపోయినట్టు ఆమె నెమ్మదిగా వెనక్కు తిరిగి వాళ్లకు కనపడకుండా తన సీట్లోనే కూర్చుండిపోయింది. వాళ్ల మాటలకు కాకుండా ఇప్పుడు నిజంగానే కళ్లు బైర్లు తిరిగిపోతున్నాయి. స్పృహ తప్పుతున్నట్టనిపిస్తోంది.

ఎందుకిలా మాట్లాడతారు వీళ్లంతా? మగ బాస్‌లు కోపంగా వుంటే అబ్బో చండశాసనుడు అంటూ భయపడతారు. అదే ఆడబాస్‌లు స్ట్రిక్ట్‌గా వుంటేనో, కోపంగా అరిస్తేనో వీళ్లే ముందు పిఎంఎస్, మెనోపాజ్ అంటూ పేర్లు పెట్టేస్తారు. నిజానికి అవి ఆడవాళ్లకు ఎంత నరకాన్ని చూపిస్తాయో అటు ఇంట్లో మగవాళ్లకూ ఇటు ఆఫీసుల్లో కొలీగ్స్‌కు అర్థంకాదు. పిఎంఎస్, మెనోపాజ్‌లు మగవాళ్లకు కూడా తెలిసినందుకు సంతోషించాలా? అవి కూడా వాళ్లకు ఆడవాళ్ల మనసులాగానే అర్థం కాకుండా మిగిలిపోయినందుకు బాధపడాలా? మనకు కనీసం ఎందుకిలా వుంటోందో అర్థమవుతోంది. పాపం మన అమ్మలకు, అమ్మమ్మలకు ఆ కొద్ది వెసులుబాటు కూడా లేదు. వాళ్లు ఎన్ని బాధల్ని కడుపులో దాచుకుని జీవితాలు వెళ్లమార్చారు? ఇప్పుడర్థమవుతోంది ఆడవాళ్లకు హిస్టీరియాలు, మానసిక రోగాలు ఎందుకు ఎక్కువ వచ్చేవో? ఇలా వాళ్లు లోపల్లోపల కోపాల్ని, ఆవేశాల్ని, బాధల్ని అన్నింటిని కుళ్లబెట్టుకుని కుళ్లబెట్టుకుని ఇంకెంత మానసిక హింస అనుభవించేవారో కదా! మెనోపాజ్, పిఎంఎస్ స్త్రీ శరీర సహజ ధర్మాలనీ, కుటుంబం సహకరిస్తే స్త్రీలు ఆ దశను ఎలా సమర్థంగా ఎదుర్కోగలరని వీళ్లందరికి ఎలా తెలియచెప్పాలి?

ఈస్ట్రోజెన్‌లోనే అసలు స్త్రీత్వం లేదని అది మనలోపలి మానవీయ ఆలోచనల్లో వుందని వీళ్లకు ఎలా చెప్పాలి? ●